కాళేశ్వరంపై కక్ష.. కర్షకులకు శిక్ష!

- తలాపున గోదారి.. మన చేను, చెలక ఎడారి!
- తెలంగాణ జీవధారపై కాంగ్రెస్ సర్కార్ కుట్ర
- ఎత్తిపోసే వీలున్నా అక్కసుతో అడ్డు పుల్లలు

నీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం

ఇదే అలసత్వం ఉంటే మార్చి చివరి నాటికి వేలాది ఎకరాల్లో పంటలు ఎండే ప్రమాదం

ఇప్పటికైనా 20 టీఎంసీలు ఎత్తిపోస్తేనే ఫలితం

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని పరిధిలో అన్నదాతలకు మళ్లీ మొదలైన నీటి కష్టాలు

పుష్కర కాలం తర్వాత ఐసీసీ ట్రోఫీని సొంతం చేసుకున్న మధుర క్షణాలు ఇంకా భారతావని కండ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. గత ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇచ్చిన లక్ష్యాన్ని ఛేదించడంలో కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన 76 పరుగులు గొప్పవా? చివరలో వచ్చి 18 పరుగులు కొట్టిన హార్దిక్ పాండ్యా, విన్నింగ్ షాట్ కొట్టిన జడేజా ఖాతాలోని తొమ్మిది పరుగులు గొప్పవా? అంటే ఏం చెప్తాం? రోహిత్ చేసిన పరుగులకు తోడు మిగిలిన వారు అవసరానికి అనుగుణంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన పరుగులే భారత్‌ను విజయతీరానికి చేర్చాయి. అందుకే రోహిత్ చేసిన 76 పరుగులకు ఎంత విలువ ఉన్నదో.. విజయానికి సరిపడేంతగా హార్దిక్, జడేజా కొట్టిన 18, 9 పరుగులకూ అంతే విలువ ఉన్నది!

ప్రధాన గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్, ఇతర ప్రాజెక్టులకు వరద లేనందునే కాళేశ్వరం లాంటి బృహత్తర ప్రాజెక్టు అనివార్యమనేది ఆ పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో మొదటగానే పొందుపరిచిన కీలక అంశం. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన 2019 నుంచి నిరుటి దాకా శ్రీరాంసాగర్‌కు వరద ఆశాజనకంగానే ఉన్నది. కానీ ఆయా ప్రాజెక్టుల్లోని నీటి నిల్వ అనేది ఆయకట్టులోని చివరి ఎకరం దాకా కడుపునిండా సాగునీరిచ్చేందుకు సరిపోదు. 2019-2022 వరకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతి యాసంగిలో శ్రీరాంసాగర్‌లోని 60-70 టీఎంసీలకు తోడు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 20-30 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకొని పుష్కలంగా సాగునీరు అందించింది. ఒకవేళ శ్రీరాంసాగర్‌కు వరద రాకుంటే అందులోని 60-70 టీఎంసీలను కూడా కాళేశ్వరంతోనే అదనంగా ఎత్తిపోసుకునేవారు. ఎలాగూ జలాశయంలో నిల్వ ఉన్నందున యాసంగి పంటలకు కావాల్సినంత మాత్రమే 20-30 టీఎంసీలను ఎత్తిపోసుకున్నారు. మరి ఎగువ నుంచి వచ్చిన 60-70 టీఎంసీలు గొప్పవా? కాళేశ్వరం నుంచి 20-30 టీఎంసీల ఎత్తిపోతలు అద్భుతమా? అంటే కచ్చితంగా కాళేశ్వరజలాలే అమృతజలాలనేది అక్షర సత్యం.

ఎందుకంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన తొలి యాసంగిలోనే లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఇప్పుడు వచ్చిన రెండో యాసంగిలోనూ అన్నదాతల కండ్ల ముందు పైర్లు పశువుల మేతకు పోతున్నాయి. నిరుడు గోదావరి పొంగిపొర్లింది. వందా.. రెండు వందలు కాదు! ఏకంగా 4000 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. యాసంగి మొదలయ్యేనాటికి శ్రీరాంసాగర్‌లో సాగుకు సుమారు 64 టీఎంసీల నీళ్లున్నాయి. అయినా పంటలు ఎందుకు ఎండిపోతున్నట్టు? అంటే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోసిన ఆ 20-30 టీఎంసీల కాళేశ్వరజలాలే ఇప్పుడు కరువయ్యాయి. శ్రీరాంసాగర్‌లోని 64 టీఎంసీల నిల్వ బూడిదలో పోసిన పన్నీరైంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, అవగాహన లేకపోవడం ఆగ్గికి ఆజ్యం పోసినట్లయి.. నిత్యం తెలంగాణ రైతు 'సాగునీళ్లు ఇయ్యండి మహాప్రభో' అని దండం, దస్కాలు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది.

రెండెకరాలు ఎండిపోయింది

పోతారం శివారులోని హన్మంతరావుకుంటలోకి ఎస్సారెస్పీ నీళ్లు రాక దాని కింద ఉన్న గిడికుంటలోకి కూడా నీళ్లు రాలేదు. దీంతో భూగర్భజలాలు తగ్గి బావులు అడుగంటి కుంట కింద సాగు చేసుకుంటున్న రైతులందరి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నం. నేను రెండు ఎకరాల్లో పొలం వేస్తే సాగునీరందక నెరెలు బారుతున్నది. రూ. లక్షా 20 వేలతో నెల కింద బావి తవ్విస్తే నీళ్లు పడక ప్రయోజనం లేకుండా పోయింది. పొలానికి పెట్టిన రూ.60 వేల పెట్టిబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని కుంటలో నీళ్లు నింపాలె. మా పంటలు ఎండిపోకుండా చూడాలె.

- సుల్వి సుగుణ, రైతు, పోతారం, సారంగాపూర్ మండలం, జగిత్యాల జిల్లా

అడగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం

- మేడిగడ్డ బరాజ్ నుంచి 2023 అక్టోబర్ 21 నుంచి 2024 మే వరకు 136 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయి. 2024 జూన్ 1 నుంచి ఇప్పటివరకు 2,725 టీఎంసీలు సముద్రంలో కలిశాయి.
- ఎస్సారెస్పీకి పదేండ్లలో రానంత వరద ఈ ఏడు వచ్చింది. 2024 జూన్ 1 నుంచి 2025 మార్చి వరకు మొత్తం 285.2 టీఎంసీల నీళ్లు ఈ ఏడాది ప్రాజెక్టులోకి చేరాయి. అందులో 108.4 టీఎంసీలు గోదాట్లో కలిశాయి. 2024 జూన్-జూలైలో అసలు నీటి విడుదల కాలేదు. నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం వ్యవరించకపోవడంతో 108 టీఎంసీలు సముద్రంపాలయ్యాయి.
- ఎస్సారెస్పీ, మేడిగడ్డ బరాజ్ నుంచి చూస్తే గత రెండు సీజన్లలో దాదాపు 3 వేల టీఎంసీలు సముద్రంలో కలిశాయి. రాష్ట్ర రైతుల అవసరాల కోసం మేడిగడ్డ బరాజ్ నుంచి కనీసం 30 టీఎంసీల నీటిని కూడా ప్రభుత్వం ఎత్తిపోయలేక పోయింది.
- ఇప్పటికీ మేడిగడ్డ బరాజ్ వద్ద రోజుకు 2,500 క్యూసెక్కుల ప్రవాహంతో నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. చిన్న చిన్న చర్యలు తీసుకుంటే నేటికీ నీళ్లను ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలతో పంటలు కండ్లముందే ఎండుతున్నాయి.
- ఎస్సారెస్పీ స్టేజీ-1, 2 మధ్య 2,142 చెరువులున్నాయి. వీటిని నింపి ఉంటే భూగర్భజలాలు పెరిగేవి. వాటి పరిధిలో ఆయకట్టుకు నీరందేది. కానీ ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. 50 శాతానికి పైగా చెరువులు వెలవెలబోతున్నాయి.
- 2024 డిసెంబర్ 25న ఎస్సారెస్పీలో 80.501 టీఎంసీలుండగా 63.85 టీఎంసీలను జోన్ 1, జోన్ 2 పరిధిలోని పంటలకు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించారు. డిసెంబర్ 25న వారబందీ పద్ధతిలో నీటి విడుదల ప్రారంభమైంది. డిసెంబర్ 25న జోన్ 2కు కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల మొదలైంది. రెండు నెలల నుంచి వారబందీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతున్నా క్షేత్రస్థాయిలో నీళ్లు అదునుకు అందడం లేదు.
- గ్రావిటీ ద్వారా నీటిని వినియోగించుకునే అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఎస్సారెస్పీ ఒకటి. ఈ విషయాన్ని ప్రభుత్వం విస్మరించింది. అందుకే దాదాపు 108 టీఎంసీల నీటిని సముద్రం పాలుచేసింది. చెరువులను నింపేందుకు ఈ నీళ్లను వినియోగించి ఉంటే నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో చెరువులు కళకళలాడేవి.
- దాదాపు 70 కిలోమీటర్ల పొడవున్న వరద కాలువకు అవసరం ఉన్న చోట తూములు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సర్కారు.. ఎస్సారెస్పీ నుంచి నీళ్లు రాకున్నా కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి వాటి ద్వారా చెరువులు, గొలుసుకట్టు చెరువులను నింపుతూ వచ్చింది. నాన్ ఆయకట్టు ప్రాంతాల్లోని గ్రామాల్లోనూ వరద కాలువ నీటి స్టోరేజ్ వల్ల భూగర్భ జలాలు వృద్ధిచెంది పంటలు పండాయి. ప్రభుత్వ ప్రణాళిక లోపం వల్ల ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది.
- వివిధ కారణాలతో ఫిబ్రవరి మొదటి వారంలోనూ వరినాట్లు వేశారు. ఈ పంటకు ఏప్రిల్ చివరి వరకు నీరు అవసరం. ప్రభుత్వం మాత్రం ఏప్రిల్ మొదటివారానికే నీటిని విడుదల చేస్తామంటున్నది. ఇదే జరిగితే వేలాది ఎకరాల్లో పంటలు ఎండుకు కొరగాకుండా పోతాయి.

కరీంనగర్, మార్చి 11 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి)/జగిత్యాల (నమస్తే తెలంగాణ) : బీడువారిన భూముల్లో నీళ్లు పారించి పచ్చని పంటలతో తెలంగాణను సస్యశ్యామలంగా మార్చేందుకు అపరభగీరథుడై కేసీఆర్ అనతికాలంలోనే కాళేశ్వరాన్ని కట్టించి రైతులకు కరువుతీరా సాగునీటిని అందించారు. వట్టిపోయిన వరప్రదాయిని శ్రీరాంసాగర్‌కు పునర్జీవం కల్పించి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో ఆయువుపోసి ఎస్సారెస్పీ చరిత్రలోనే సరికొత్త చరిత్ర లిఖించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ ఒక్క పిల్లర్ కుంగితే దాన్నే ఎన్నికల అస్త్రంగా మార్చుకున్న కాంగ్రెస్, నానా యాగీ చేసి అధికారంలోకి రాగానే అక్కసుతో నీటి ఎత్తిపోతలను ఆపేసింది. జలాలను ఎత్తిపోసుకునేందుకు పుష్కలమైన అవకాశాలున్నా అడ్డుపుల్లలు వేస్తూ తీవ్ర నిర్లక్ష్యం చేసింది. తీరా ఇప్పుడు యాసంగిలో కాళేశ్వరం నీళ్లందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే చోద్యం చూస్తున్నది. కేసీఆర్ కట్టించాడన్న కారణంతో కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్కసు వెల్లగక్కుతూ నిరుపయోగంగా మార్చడం రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి అన్నదాతలు అల్లాడుతుంటే కాళేశ్వరం జలాలు అందించకుండా కాంగ్రెస్ తన అహంకార ధోరణిని ప్రదర్శిస్తున్నది. ఈ ప్రాజెక్టు పరిధిని పంటలను కాపాడాలంటే ఏప్రిల్ చివరి వరకు నీళ్లివ్వాల్సిన అవసరమున్నది. రైతులపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. వారి కష్టాలు, కన్నీళ్లను తుడిచేందుకు ఇకనైనా కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కాళేశ్వరం ద్వారా మేడిగడ్డ నుంచి ఇప్పటికి ఎత్తిపోసిన జలాలు (టీఎంసీల్లో)

సంవత్సరం	జలాలు
2019-20	61.66
2020-21	31.82
2021-22	33.97
2022-23	25.97
2023-24	8.97

బీఆర్ఎస్ హయాంలో రికార్డులు

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం పంటలకు అనుగుణంగా కాళేశ్వరం జలాలను తరలించింది. ఎల్ఎండీ దిగువన కాకతీయ కాలువ గరిష్ఠ ప్రవాహం 8500 క్యూసెక్కులు. కానీ, ఉమ్మడి రాష్ట్రంలో ఏనాడూ 4 వేల క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేసిన దాఖలాల్లేవు. కేసీఆర్ హయాంలో కాలువ 0 కిలో మీటర్ నుంచి 146వ కిలోమీటర్ వరకు రూ.100 కోట్లతో, ఎల్ఎండీతో పాటు స్టేజీ-2లోనూ రూ.774 కోట్లతో పనులు పూర్తి చేసి కాలువను బలోపేతం చేసి 6100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టుకూ నీరందించారు.

1985లో దిగువమానేరు జలాశయం ప్రారంభమైంది. అప్పటి నుంచి నేటివరకు ఏ యాసంగి సీజన్‌లోనూ 52 టీఎంసీల నీటిని దిగువకు వదిలిపెట్టలేదు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు యాసంగి సీజన్లలో 52 టీఎంసీల నీటిని దిగువకు పంపించింది.

నెలన్నర పాటు ఎల్ఎండీ దిగువన కాకతీయ కాలువకు నీటిని నిరంతరంగా గతంలో ఏనాడూ విడుదల చేయలేదు. కానీ, బీఆర్ఎస్ హయాంలో 146 రోజుల పాటు కొనసాగింది.

ఎస్సారెస్పీ స్టేజీ-2 అంటే 284వ కిలోమీటర్ నుంచి 348వ కిలోమీటర్ పరిధిలో ఉన్న మొత్తం 767 చెరువులు నిండాయి. సూర్యాపేట జిల్లా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే కాకుండా ఈ పరిధిలో చెరువులనూ నింపింది.

ఎస్సారెస్పీ చరిత్రలో స్టేజీ-2 పరిధిలోని ఆయకట్టుకు గత ప్రభుత్వాల హయాంలో ఒక ట్రెండు టీంఎసీలు కూడా వెళ్లలేదు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సీజన్లలో దాదాపు 24 టీఎంసీలకుపైగా నీటిని అందించింది.

కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత 2022లో వానకాలం, యాసంగి కలిపి ఏకంగా 24,30,753 లక్షల ఎకరాలు సాగవడం ఎస్సారెస్పీ చరిత్రలోనే రికార్డు. గోదావరి జలాలను పరిపూర్ణంగా వినియోగించుకునే అవకాశం కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది.

గోద్రెజ్ ఆగ్రోవెట్ చేతికి క్రీమ్‌లైన్ డెయిరీ

హైదరాబాద్, మార్చి 11: హైదరాబాద్ కేంద్రంగా పాల ఉత్పత్తుల విక్రయ సంస్థ క్రీమ్‌లైన్ డెయిరీని హస్తగతం చేసుకున్నది గోద్రెజ్ ఆగ్రోవెట్. ఇప్పటికే 51.94 శాతం వాటాను కొనుగోలు చేసిన గోద్రెజ్ ఆగ్రోవెట్ తాజాగా రూ.930 కోట్లతో మరో 48 శాతం వాటా కొనుగోలు చేసింది. ఈ వాటా కొనుగోలుకు కంపెనీ బోర్డు సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సంస్థ వెల్లడించింది. ఈ ఒప్పందం సెప్టెంబర్ 30 నాటికి పూర్తికాగలదనే విశ్వాసాన్ని వ్యక్తంచేసింది.

స్పేస్‌ఎక్స్‌తో ఎయిర్‌టెల్ జట్టు

న్యూఢిల్లీ, మార్చి 11: టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలకోసం ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో జట్టుకట్టింది. దీనిపై ఇరు సంస్థలు నేడు అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీంతో స్టార్‌లింక్స్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని అందించడానికి వీలు పడనున్నది. ఈ సందర్భంగా ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ మాట్లాడుతూ..భారత్‌లో ఎయిర్‌టెల్ కస్టమర్లకు ఇంటర్నెట్ సేవలు అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో పనిచేయడం ఓ మైలురాయి వంటిదన్నారు. కస్టమర్లకు శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించడానికి కట్టుబడివుందనడానికి ఈ ఒప్పందం నిదర్శనమన్నారు.

ఇండస్‌ఇండ్ లెక్కల్లో 2,100 కోట్లు తేడా

డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో బయటపడ్డ వైనం

ఒక్కరోజే 27 శాతానికిపైగా పడిపోయిన బ్యాంక్ షేర్ విలువ

న్యూఢిల్లీ, మార్చి 11: దేశంలోని టాప్-5 ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్‌ఇండ్ బ్యాంక్ లెక్కల్లో ఏకంగా రూ.2,100 కోట్ల తేడా బయటపడింది. గత ఏడాది డిసెంబర్ నాటికున్న బ్యాంక్ నికర విలువలో ఇది దాదాపు 2.35 శాతానికి సమానం కావడం గమనార్హం. కాగా, డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో ఈ వ్యత్యాసాన్ని బ్యాంక్ గుర్తించింది. నిరుడు సెప్టెంబర్, అక్టోబర్ అకౌంటింగ్‌లో తప్పుల్ని కనుగొన్నామని, గత వారమే ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ప్రాథమికంగా తెలియపర్చామని బ్యాంక్ సీఈవో, ఎండీ సుమంత్ కత్‌పాలియా తాజాగా తెలిపారు. అయితే బ్యాంక్ లాభాలు, మూలధనం దృష్ట్యా సదరు రూ.2,100 కోట్లను సర్దుబాటు చేసుకునే సామర్థ్యం తమకున్నదని చెప్పినా.. స్టాక్ మార్కెట్లలో మదుపరుల భయాలను అడ్డుకోలేకపోయారు. మంగళవారం ట్రేడింగ్‌లో అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో 27 శాతానికిపైగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్ విలువ దిగజారింది. బీఎస్ఈలో 27.17 శాతం కోల్పోయి రూ.655.95 వద్ద ముగియగా, ఒకానొక దశలో 52 వారాల కనిష్ఠాన్ని తాకుతూ రూ.649కి పతనమైంది. ఎన్ఎస్ఈలోనూ 27.06 శాతం నష్టపోయి రూ.656.80 వద్ద నిలిచింది. నిజానికి సోమవారమే ఈ సమాచారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియపర్చగా.. లెక్కల్లో అసలు తేడా ఎంతన్నది వచ్చే నెల్లోగానీ తెలియకుండా ఉన్నది. ఓ బయటి ఏజెన్సీతో బ్యాంక్ విచారణ జరిపిస్తున్నది. ఆ నివేదిక వస్తేగానీ అకౌంటింగ్‌లో కచ్చితమైన వ్యత్యాసం వెలుగుచూడదు.

అసలేం జరిగింది..

గడిచిన ఫారెక్స్ లావాదేవీలకు సంబంధించి హెడ్జింగ్ ఖర్చుల్ని బ్యాంక్ తక్కువగా అంచనా వేసినట్టు ఓ అంతర్గత సమీక్షలో తేలింది. దీనివల్ల రూ.2,100 కోట్ల వరకు లెక్కల్లో వ్యత్యాసం వచ్చింది. దీన్ని చక్కదిద్దేంత మూలధనం ఉందని చెప్పినా ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు తెగబడ్డారు. బ్యాంకులో పాలనాపరమైన లోపాలున్నాయన్న ఆందోళనలు మదుపరుల్లో నెలకొన్నాయి. గత వారం బ్యాంక్ సీఈవో, ఎండీ కత్‌పాలియా పదవీకాలాన్ని మూడేండ్లకు పెంచుతూ ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు ప్రతిపాదించినా, ఆర్బీఐ మాత్రం ఏడాదికే అనుమతిచ్చింది. దీంతో సోమవారం బ్యాంక్ షేర్ 4 శాతం వరకు నష్టపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఏడాది కనిష్ఠానికి క్షీణించింది.

పెరిగిన టెలికం సబ్‌స్క్రైబర్లు

డిసెంబర్ నాటికి 118.99 కోట్లకు..

న్యూఢిల్లీ, మార్చి 11: గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు స్వల్పంగా పెరిగారు. డిసెంబర్ నెల చివరినాటికి స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికం దిగ్గజం జియోకు ఈసారి భారీ ఊరట లభించింది. గతేడాది నవంబర్ నెల చివరినాటికి 118.77 కోట్లుగా ఉన్నారు. వీరిలో పట్టణప్రాంతాల్లో ఉన్న టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు 65.98 కోట్లు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 52.72 కోట్లు ఉన్నారు. అలాగే వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 114.86 కోట్ల నుంచి 115.06 కోట్లకు పెరిగారు. గతేడాది చివరి నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 39.06 లక్షల మంది చేరగా, ఎయిర్‌టెల్‌లోకి 10.33 లక్షల మంది జతయ్యారు. కానీ వొడాఫోన్ ఐడియా 17.15 లక్షల మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. అలాగే బీఎస్ఎన్ఎల్ 3.16 లక్షల మంది, ఎంటీఎన్ఎల్ 8.9 లక్షల మందిని కోల్పోయాయి.

- వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్లు 3.85 కోట్ల నుంచి 3.92 కోట్లకు పెరిగారు.
- ఈ విభాగంలోనూ జియో మొదటిస్థానంలో ఉన్నది. కొత్తగా 6,56,823 మంది చేరారు అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 1,62,945 మంది జతయ్యారు.
- బీఎస్ఎన్ఎల్ అత్యధికంగా 33,306 మంది వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. అలాగే ఎంటీఎన్ఎల్ కూడా 14 వేల మంది వెళ్లిపోయారు.

ఫోన్‌పే @ 60 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 11: ఫిన్‌టెక్ దిగ్గజాల్లో ఒకటైన ఫోన్‌పే మరో మైలురాయికి చేరుకున్నది. 60 కోట్ల మంది కంపెనీ సేవలు పొందుతున్నారని పేర్కొంది. ఆర్థిక సేవలు ప్రారంభించి పదేండ్లు పూర్తైన సందర్భంగా ఈ కీలక రికార్డును సొంతం చేసుకోవడం విశేషమని కంపెనీ కో-ఫౌండర్, సీఈవో సమీర్ నిగమ్ తెలిపారు. గతపదేండ్లలో సంస్థ అన్ని రంగాల్లో సేవలు అందిస్తున్నదని, ముఖ్యంగా వెల్త్ మేనేజ్‌మెంట్, ఈ-కామర్స్ వంటి విభాగాలు కూడా ఉన్నాయన్నారు. స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్న కంపెనీ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

వాణిజ్య

యమహా నయా బైకు

ధర రూ.1.44 లక్షలు

చెన్నై, మార్చి 11: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ యమహా మోటర్..దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన మోటర్‌సైకిల్ ఎఫ్‌జెడ్-ఎస్-ఎఫ్ఐ హైబ్రిడ్ నయా మాడల్‌ను పరిచయం చేసింది. ఈ బైకు ధర రూ.1.44 లక్షలు(చెన్నై షోరూంనకు సంబంధించినవి). పాత మాడల్‌తో పోలిస్తే నయా మాడల్‌లో టెక్నాలజీ పరంగా అప్‌గ్రేడ్ చేసి విడుదల చేసింది. 149 సీసీ బ్లూకోర్ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ఓబీడీ-2బీ స్టాండర్డ్, స్మార్ట్ మోటర్ జనరేటర్, స్టాప్-స్టార్ట్ ఎకోసిస్టమ్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఓబీడీ-2బీ అంటే సెన్సార్ పనితీరు మెరుగుపడటంతోపాటు ఇంజిన్ పనితీరును డ్రైవింగ్ సమయంలోనే గుర్తించవచ్చును. దేశీయంగా ఎఫ్‌జెడ్ బ్రాండ్ నాటుకుపోయిందని, ప్రతి జనరేషన్‌కు నచ్చే విధంగా పలు మాడళ్లను రూపొందించినట్లు, ఇదే క్రమంలో యువత కోరుకుంటున్న విధంగా ఈ మాడల్‌ను తీర్చిదిద్దినట్లు కంపెనీ చైర్మన్ ఒటానీ తెలిపారు.

సింగరేణి 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్

రూ.7,995 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): వ్యాపార విస్తరణలో భాగంగా విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్న సింగరేణి సంస్థ కొత్తగా 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్‌ను నిర్మించనుంది. మంచిర్యాల జిల్లా జైపూర్ ప్లాంట్ సమీపంలోనే ఈ కొత్త ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం మంగళవారం భెల్ సంస్థతో సింగరేణి అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి, భెల్‌కు ఈ ప్లాంట్ నిర్మాణ బాధ్యతలప్పగించింది. రూ.7,995 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్లాంట్‌ను గరిష్ఠంగా నాలుగేండ్లలో పూర్తిచేయాలని ఒప్పందం కుదుర్చుకున్నా, 40నెలల్లో పూర్తిచేయాలని సింగరేణి సీఎండీ బలరాం ఈ సందర్భంగా స్పష్టంచేశారు. వచ్చేనెల నుంచి నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతమున్న 1,200 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ద్వారా సంస్థకు ఏటా రూ. 450 కోట్ల లాభాలు వస్తుండగా, కొత్తగా ఈ ప్లాంట్ కూడా అందుబాటులోకి వస్తే లాభాలు మరో రూ.300 కోట్లు పెరిగే అవకాశాలున్నాయి.

ఎన్ఎండీసీ సహకారం..

బొగ్గు, క్రిటికల్ మినరల్ మైనింగ్‌లో పరస్పర సహకారం కోసం సింగరేణి సంస్థ ఎన్ఎండీసీతో కలిసి పనిచేయనున్నది. ఇందుకు సంబంధించి ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ మంగళవారం సింగరేణి సీఎండీ బలరాంతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా క్రిటికల్ మినరల్స్, ఇతర ఖనిజాల మైనింగ్‌లో పరస్పరం భాగస్వామ్యంకావాలని నిర్ణయించారు.